



డిఆర్ఒ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



నాయకులకు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

కదిలిన ఎర్రదండు

- సిపిఎం పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం
- వేలాది మందితో సాగిన మహా ప్రదర్శన
- సిపిఎం బృందానికి సమస్యల విన్నపాలు - వినతిని స్వీకరించిన డిఆర్ఒ

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/కలెక్టరేట్/కార్పొరేషన్

కర్నూలు జిల్లా సమగ్రాబివృద్ధి కోసం ఈ నెల 2న ఆదోనిలో ప్రారంభమైన సిపిఎం మహా పాదయాత్ర సోమవారం కర్నూలుకు చేరుకుంది. ఈ పాదయాత్ర బృందానికి పెద్ద ఎత్తున సిపిఎం శ్రేణులు, ఇతర సంఘాలు ఘనంగా స్వాగతం పలికాయి. ఆయా వర్గాల ప్రజలు తమ సమస్యలను సిపిఎం బృందానికి విన్నవించుకున్నారు. ఉదయం పెద్దపాడు సమీపంలోని తాజ్ ఫంక్షన్ హాల్ నుండి సిపిఎం మహా పాదయాత్ర బృందం బళ్లారి చౌరస్తాకు చేరుకుంది. సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి ప్రదర్శకు అగ్రభాగాన కలెక్టరేట్‌వరకు నడిచారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్‌తో పాటు కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, జి.రామకృష్ణ, వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులకు ఘనంగా పూలమాలలతో స్వాగతం పలికారు. బళ్లారి చౌరస్తా సమీపంలో ఎపి ఆటో ట్రాలీ డ్రైవర్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్ బృందంతో ఘనంగా స్వాగతం పలికారు. కొత్త బస్టాండ్ సమీపంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ హమాలి వర్కర్లు గజమాలతో స్వాగతం పలికారు. సుందరయ్య సర్కిల్లో సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు, ఆటో డ్రైవర్స్ యూనియన్ న్యూ సిటీ కార్యదర్శి రాధాకృష్ణ, ఐద్వా శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి పి.నిర్మల, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, గర నాయకులు కిరణ్మయి హారతులు ఇచ్చి నుదుటిపై ఎర్రటి తిలకం దిద్ది పాదయాత్ర బృందాన్ని ఆహ్వానించారు. యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, జిల్లా కోశాధికారి హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధి బృందం పూలతో స్వాగతం పలికారు. బంగారు పేట సర్కిల్ వద్ద సిపిఐ నాయకులు సంఘీభావం తెలుపుతూ పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

అనంతరం రాజ్ విహార్ సెంటర్ సర్కిల్లో సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ, ఆటో వర్కర్స్ యూనియన్ ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో డప్పులు మోగించి పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు. అంబేద్కర్ భవన్ సమీపంలో సిపిఎం కర్నూలు మండల కార్యదర్శి హుసేన్నయ్య ఆధ్వర్యంలో మహిళలు పూలమాలలు వేసి మహా పాదయాత్రకు సంఘీభావం తెలియజేశారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయ సర్కిల్లో విఆర్ఎల సంఘం నాయకులు సిపిఎం బృందానికి స్వాగతం పలకడమే కాకుండ విఆర్ఎలను ప్రభుత్వం తీసుకువచ్చారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి అంబులెన్స్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహాపాదయాత్ర బృందానికి వినతి పత్రం సమర్పించి తమపై ట్రాఫిక్ అధికారులు వేధింపులను నియంత్రించాలని విన్నవించుకున్నారు. సిపిఎం జొహరాపురం కొట్టాల కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతూ గుడిసెలకు పట్టాలివ్వకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కొట్టాల కమిటీ నాయకులు నాగరాజు మహా పాదయాత్ర బృందం దృష్టికి తెచ్చారు. కలెక్టరేట్ వద్ద కాటికాపర్ల సంఘం ప్రతినిధి బృందం కలిసి తమ సంక్షేమానికి ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని పాదయాత్ర బృందం దృష్టికి తీసుకువచ్చారు. కర్నూలు మండలం ఈ తాండ్రపాడు సర్పంచి బాలపీర, పంచలింగాల సర్పంచి కృష్ణ పూలబోకెలను అందజేసి మహా పాదయాత్ర బృందానికి అభినందనలు తెలిపారు. దాదాపుగా మూడు గంటల పైగా జరిగిన మహా ప్రదర్శనకు వేలాదిమంది ప్రజలు తరలివచ్చి కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి పాలక పక్షాలు చర్యలు తీసుకోవాలంటూ నినదించారు. అడుగడుగునా బృందానికి అన్ని వర్గాల నుండి మద్దతు లభించింది. బళ్లారి చౌరస్తా నుండి కొత్త బస్టాండ్, మౌర్యా ఇన్ కూడలి, రాజ్ విహార్ మీదుగా కలెక్టరేట్ వరకూ మహా ప్రదర్శన సాగింది. ప్రదర్శనకు ముందు భాగాన పిఎన్ఎం కళాకారులు, డప్పు కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి, మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

సస్యశ్యామలం చేసే వరకు పోరాటం

- సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

కర్నూలు జిల్లాను సస్యశ్యామలం చేసే వరకు పోరాటం సాగిస్తామని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన మహా పాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ అధ్యక్షతన మహా ధర్నా నిర్వహించారు. మహా ధర్నాలో బివి రాఘవులు మాట్లాడుతూ సిపిఎం నాయకులు జిల్లా అబివృద్ధి కోసం పాదయాత్ర చేశారన్నారు. గతంలోనూ సిపిఎం నాయకులు ఇలాంటి పాదయాత్రలను చేశారని, పాదయాత్ర తర్వాత కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారని, ఆ తరువాత శంకుస్థాపన రాళ్లు కూడా పోయాయని తెలిపారు. విద్య, వైద్యం, నీటిపారుదల, పారిశ్రామికంగా కర్నూలు జిల్లా వెనుకబడి ఉందన్నారు. జిల్లాకు మేలు చేయలేని ఆర్థిక శాఖ మంత్రి ఎందుకని, రాజీనామా చేసి కూర్చోవాలని తెలిపారు. నాయకులు గెలిస్తే వాళ్లకు మేలు కలుగుతుంది తప్ప ప్రజలకు ఏమి కాదని, ప్రజలు గెలిస్తేనే రాష్ట్రం ముందుకు పోతుందని అన్నారు. కర్నూలు జిల్లా ముందుకు పోవాలంటే ప్రాజెక్టులు కట్టాలన్నారు. ఏ రకంగానూ ప్రజలకు ఉపయోగపడని ఎమ్మెల్యేలు ఎందుకని ప్రశ్నించారు. ప్రాజెక్టులు, రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ గురించి ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడరన్నారు. వేదవతి గుండ్రేవుల పూర్తి చేయాలని, రైల్వే వేగం వర్క్ షాప్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మిగతా జిల్లాలతో సమానంగా కర్నూలును అభివృద్ధి చేయాలన్నారు.

అభివృద్ధి సాధించే దాకా ఉద్యమం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

. జిల్లాలో ప్రాజెక్టులు విద్య, వైద్యంలో అభివృద్ధి సాధించేవరకు పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే ప్రభాకర్ రెడ్డి తెలిపారు. పాదయాత్ర ద్వారా కొన్ని అంశాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర సమయంలో జిల్లా అభివద్ధికి జగన్ ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయరని, వారికి బాధ్యత లేదా అని ప్రశ్నించారు. కర్నూలు జిల్లా అన్ని రంగాల్లో అత్యంత వెనుకబడి ఉందని, భూకబ్జాల్లో ముందుందని తెలిపారు. అక్రమ వ్యాపారాలకు వైసీపీ ఎమ్మెల్యేలు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్నారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి గతంలో టిడిపి, ఇప్పుడు వైసిపి జిల్లాకు చేసిన అన్యాయాన్ని వివరించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ ఈ పాదయాత్ర పదవుల కోసమో, అధికారం కోసమో చేసిన పాదయాత్ర కాదని, జిల్లా సమగ్రాభివృద్ధి కోసం చేసిన పాదయాత్రని తెలిపారు. అన్ని జిల్లాల్లో కర్నూలు జిల్లా అత్యంత వెనకబడి ఉందన్నారు. మౌనంగా కూర్చుంటే పాలకులు ఏమీ పట్టించుకోరన్నారు. మంత్రి గుమ్మనూరు మండలంలోనే తాగునీటి సమస్య ఉందని, పేకాట ఆడించడం, ఇసుక దందా చేయడం తప్ప జిల్లా అభివృద్ధికి గుమ్మనూరుకు పట్టదా అని ప్రశ్నించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప మద్దతు తెలిపి మాట్లాడారు. అనంతరం డిఆర్ఒ నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, జి.రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, పి.నిర్మల, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట కాటి కాపరుల వినతిని స్వీకరిస్తున్న బివి.రాఘవులు



వినతులను స్వీకరిస్తున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్

పోలీస్ స్పందనకు 101 ఫిర్యాదులు


వేగంగా పరిష్కరించాలని ఎస్‌పి ఆదేశం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్‌పి జి. కృష్ణకాంత్ నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 101 ఫిర్యాదులు అందాయని ఆయన తెలిపారు. వచ్చిన ఫిర్యాదులపై వేగంగా విచారణ జరిపి న్యాయం చేయాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతోఎస్‌పి సవివరంగా మాట్లాడారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ స్పందనలో డిఎస్‌పి యుగంధర్ బాబు , లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐలు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేటర్



సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి. రాఘవులు కర్నూలు మహాధర్నాకు హాజరయిన సందర్భంగా ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కారం కోసం సిపిఎం ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొని రావాలని ఆవాజ్ కమిటీగా వినతి పత్రం ఇచ్చింది. ఆవాజ్ నగర అధ్యక్షులు పి. ఇక్బాల్ హుస్సేన్, ఆవాజ్ నగర కార్యదర్శి మొహమ్మద్ షరీఫ్, ఆవాజ్ నగర కమిటీ నాయకులు అబ్దుల్ నయీమ్, ఫయాజుల్ కరీం ,ఇలియాజ్, ఇంతియాజ్ ,ఫయాజ్ ఖాద్రి, షేక్షావలి, మహబూబ్ బాషా, ఖలీల్ ఖాన్, గౌస్ బాషా, అక్బర్ అలీ ,అబ్దుల్ రహమాన్, నూర్ వలి పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఎఒ

ప్రజాశక్తి-సి బెళగల్

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, సజ్జ, జొన్న, కొర్ర, వేరుశనగ పంటలను ఎఒ పరిశీలన చేశారు. సోమవారం బురాన్ దొడ్డిలో రైతుభరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందితో పొలాలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులకనుగుణంగా పంటలు వేసుకోవడం మంచిదన్నారు. అలాగే మిశ్రమ పంటలు కందిలో మినుములు, అలుసందలు,పెసలు వంటివి అనుకూలమన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్: 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ డాక్టర్ జి.సృజన, అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన 77వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల నిర్వహణకు చేయవలసిన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతూ ఈ నెల 15న స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను, వేదికను అందంగా అలంకరించాలని ఆదేశించారు. ఈ ఏడాది కూడా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. వివిధ రకాల శకటాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా అందంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఛాయచిత్ర ప్రదర్శను కూడా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వానికి ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ఇచ్చే ప్రశంస పత్రాలను ఆయా శాఖల అధికారులు ఉత్తమ సేవలందించిన సిబ్బందిని మాత్రమే సిఫారసు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రశంసా పత్రాలకు సంబంధించి సిబ్బంది పేర్లను ఈనెల 12వ తేదిలోపు అందజేయాలని కోరారు.

గ్రామ సేవకుల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

గ్రామ సేవకుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సోమవారం ధర్నా చౌక్ దగ్గర గ్రామ సేవకులు నిరసన దీక్షలు చేపట్టారు.విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు అంజి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి గతంలో గ్రామ సేవకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేస్కేల్‌ను అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో విఆర్ఎల వ్యవస్థను రద్దుచేసి విఆర్ఎలందరిని గవర్నమెంట్ ఉద్యోగులుగా నియమించారన్నారు. ఎపిలో గతంలో ఉన్న జీవోలను కాకుండా కొత్తగా జీవోలను తెస్తూ ప్రమోషన్లు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడుతుందని విమర్శించారు. ఇంటర్మీడియట్ చదివిన ప్రతి ఒక్కరికి ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిగ్రీ అర్హతగా ఉండాలనే నిబంధనలను తొలగించాలని కోరారు. గతంలో విఆర్ఎల్ నుంచి రికవరీ చేసిన డబ్బు మొత్తాన్ని చెల్లించాలన్నారు. గ్రామ సేవకుల కుటుంబంలో వారసత్వ హక్కుగా ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. రెండు రోజుల దీక్షలు అనంతరం విజయవాడలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, విఆర్ఎల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా నాయకులు మల్లయ్య ప్రహ్లాద పాల్గొన్నారు.



విఆర్ఎలను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

పచ్చిమిర్చి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని వెల్దుర్తి మండలం రామళ్లకోట, సర్పరాజు పురం గ్రామాల్లోని రైతులు పచ్చిమిర్చి వేసి తీవ్రంగా నష్టపోయారని, తక్షణమే ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను డాక్టర్ జి.సృజనకు ఎపి రైతు సంఘం ప్రతినిధి బందం వినతి పత్రం సమర్పించింది. జి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే రామళ్లకోట నర్సరీలలో పచ్చిమిరప మొక్కలను 70 నుండి 80 పైసలు పెట్టి కొని రామళ్లకోట సర్పరాజు పురం బోయిన్‌పల్లి, కలగొట్ల పుల్లగుమ్మి తదితర గ్రామాల్లో 3వేల ఎకరాలలో పచ్చిమిరపను సాగు చేశారని తెలిపారు. ఈ సంవత్సరం నకిలీ విత్తనాలు, ప్రభుత్వ గుర్తింపు లేని నర్సరీలు తదితర సమస్యలతో పూర్తిగా పచ్చిమిరప సాగు చేసిన రైతులందరూ నష్టపోయారన్నారు. పచ్చిమిరప సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ. 60 వేల నుండి రూ.70 వేల వరకు ఖర్చు చేశారన్నారు. రామళ్లకోట కాకుండా గడివేముల నుండి మిరపనార తీసుకువచ్చి నాటిన రైతుల పచ్చిమిరప తోటలు బ్రహ్మాండంగా ఉన్నాయని తెలిపారు. నకిలీ విత్తనాలు వల్లే ఈ సమస్య వచ్చిందని అర్థమవుతుందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తీవ్రంగా నష్టపోయిన పచ్చిమిరప రైతులకు ఎకరాకు రూ.50,000 నష్టపరిహారం ఇవ్వాలన్నారు. గుర్తింపు లేని నర్సరీలపై చర్యలుతో నకిలీ విత్తనాలు అమ్ముతున్న కంపెనీలు షాపులపై కూడా చర్యలు తీసుకొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, రైతులు రామనాయుడు, రామమద్దిలేటి,మధుశేఖర్, శివకుమార్, అశోక్, మద్దయ్య, బాషాతో పాటు 50 మంది రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు, రైతులు



స్పందనలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

స్పందన అర్జీల పట్ల అలసత్వం తగదు :కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో అలసత్వం లేకుండా సకాలంలో అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ నాగేశ్వరరావు, జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్‌లను నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలన్నారు. రీఓపెన్ అయిన వాటికి సరైన రీతిలో ఎండార్స్‌మెంట్లు ఇచ్చి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీవెన్స్‌లను సకాలంలో పరిష్కరించే అంశంపై దృష్టి సారించి గ్రీవెన్స్‌లను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు గాయాలు

ప్రజాశక్తి తుగ్గలి



తుగ్గలికి చెందిన మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ తమ్మారెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వైసిపి నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి సతీమణి రంగమ్మ ,రంగమ్మ చెల్లెలు అరుణమ్మలకు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. హైదరాబాదులో జరిగిన ఒక ఫంక్షన్‌లో పాల్గొని తిరిగి స్వగ్రామమైన తుగ్గలికి వస్తుండగా మూడు కిలోమీటర్ల దూరంలో రాతన రైల్వే రోడ్డు వద్ద బ్రిడ్జికి ప్రమాదవశాత్తు కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన శ్రీనివాస్ రెడ్డి, రంగమ్మ ,విజయలక్ష్మి, అరుణమ్మ తదితరులు కర్నూలులోని గౌరీగోపాల్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి నాగరత్నమ్మ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ రెడ్డి, రాతన మోహన్ రెడ్డి,వైస్ ఎంపిపి మల్లికార్జున రెడ్డి, తదితరు పరామర్శించారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



నవధాన్యాల కిట్టు అందిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు భవనంలో ఎస్సీ రైతులకు నవధాన్యాల కిట్టు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల విలువ చేసే 16 రకాల విత్తనాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. జిల్లాలో 1,648 మంది రైతులకు, ఆదోని నియోజకవర్గంలో పెద్దహరివాణం, బైచిగేరి గ్రామాల్లో 820 మంది రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే కాకుండా ప్రతి రైతుకూ కిట్లు అందేలా చూడాలని కోరారు. ఉచితంగా కాకపోయినా సబ్సిడీ కింద ఇచ్చినా రైతులు తీసుకుని ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. 82 మంది రైతులు సాగు విధానం తర్వాత ఎలాంటి దిగుబడి వచ్చిందనే అంశాలను మళ్లీ వివరించాలని, ఎవరూ సాగు చేయకపోయినా ఆ బాధ్యత అధికారులపై ఉంటుందని హెచ్చరించారు. డిపిఎం చంద్రశేఖర్ నాయక్, ఎస్సీ కార్పొరేషన్ మేనేజర్ శ్రీనివాసులు, ఎమ్‌టి రేవన్న, మార్కెట్ యార్డు ఛైర్మన్ మజీర అహ్మద్, వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఎడిఎ గిరీష్, ఎఒ అశోక్ కుమార్, ఎంసిఆర్‌పి రంగస్వామి, సర్పంచి రామన్న, వైసిపి సీనియర్ నాయకులు పంపాపతి, మెడికల్ నాగరాజ్, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి ఎంపిక అభినందనీయం

- తహశీల్దార్ కుమార స్వామి

ప్రజాశక్తి - ఆస్పరి



విద్యార్థిని అభినందిస్తున్న అధికారులు

ఆస్పరిలోని విజేత స్కూల్ విద్యార్థి ఆర్‌పి.జితేంద్ర సింగ్ కడప జిల్లాలోని ఇడుపులపాయి దగ్గర ట్రిపుల్ ఐటికి ఎంపిక కావడం పట్ల తహశీల్దార్ కె.కుమార స్వామి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో జితేంద్ర సింగ్‌ను తహశీల్దార్ కుమారస్వామి, జిల్లా కెడిసిసి డైరెక్టర్ రాఘవేంద్ర, డిప్యూటీ తహశీల్దార్ గాయత్రి, ఎంఇఒ రాజేంద్రప్రసాద్, ఇఒఆర్‌డి నరసింహారెడ్డి, పిఆర్ ఎఇ యమునప్ప అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విజేత స్కూల్‌లో చదువుతూ పది పరీక్షల్లో 586 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. కష్టపడి చదివి ట్రిపుల్ ఐటిలో సీటు సాధించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకున్నారని చెప్పారు. విద్యార్థి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులు చదువుకునేందుకు ప్రోత్సహించారని తెలిపారు. ప్రత్యేక తరగతులు తీసుకొని విజయానికి తోడ్పాటునందించారని, కరస్పాండెంట్ మల్లేష్, ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి సహకారం మరవలేనిదని చెప్పారు.

ఎల్‌ఎల్‌సి నీటిని మళ్లించి...

చెరువులు నింపేందుకు ఎమ్మెల్యే చొరవ

ప్రజాశక్తి - మంత్రాలయం



పూజలు నిర్వహిస్తున్న నాయకులు

ఎల్‌ఎల్‌సి ప్రధాన కాలువ ద్వారా నీటిని మళ్లించి చెరువులు నింపేందుకు చొరవ తీసుకున్న ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డికి, రాంపురం రెడ్డి సోదరులకు ఆరు గ్రామాల ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మండలంలోని ఎల్‌ఎల్‌సి ప్రధాన కాలువ వద్ద వైసిపి మండల ఇన్‌ఛార్జీ, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ సి.విశ్వనాథ్ రెడ్డి, నాయకులు కాంతారెడ్డి రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు ఎప్పుడూ అండగా నిలుస్తున్న రాంపురం రెడ్డి సోదరుల కృషితోనే నీటి మళ్లింపు సాధ్యమైందని పేర్కొన్నారు. మండలంలోని వగరూరు రిజర్వాయర్ (సూగూరు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు)కు తుంగభద్ర డ్యాం ద్వారా విడుదలైన నీటిని ఎల్‌ఎల్‌సి ప్రధాన కాలువ ద్వారా మళ్లించి చెరువుల్లో నీరు నిల్వ ఉండేలా చూడాలని జాలవాడి, కంబాలదిన్నె, వగరూరు, వి.తిమ్మాపురం, బూదూరు, సూగూరు గ్రామాల ప్రజలు రాంపురం రెడ్డి సోదరులను కలిసి సమస్యను ఇటీవల వివరించారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఎల్‌ఎల్‌సి అధికారులతో మాట్లాడి రాగిమాన్‌దొడ్డి వద్ద ఉన్న ఎల్‌ఎల్‌సి ప్రధాన కాలువ ద్వారా వాగు మార్గంలో తుంగభద్ర డ్యాం జలాలను వగరూరు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారని చెప్పారు. వారి ప్రయత్నం వల్ల ఎల్‌ఎల్‌సికి నీటి సరఫరా అయిందని, తాగు, సాగు నీటికి పరిష్కారం దొరికిందని తెలిపారు. వీరారెడ్డి, సర్పంచి లింగా రెడ్డి, ఎంపిటిసి చినన్న పాల్గొన్నారు.

వారం రోజుల్లో శ్రావణ మాసోత్సవాలు

- పూర్తికాని టెండర్ల ప్రక్రియ - ప్రారంభం కానీ పనులు - అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - కౌతాళం

కర్నూలు జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న శ్రావణమాస ఉత్సవాలు వారం రోజుల్లో అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. నెల రోజులపాటు జరిగే ఉత్సవాల ఏర్పాట్లలో దేవాలయ అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. ఈ ఉత్సవాలకు సుమారు 15 నుంచి 20 లక్షల మంది భక్తులు పుణ్యక్షేత్రానికి వస్తారు. శ్రావణమాస ఉత్సవాల నుంచి దేవాలయానికి రూ.12 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుతం జిల్లాలో అత్యధిక ఆదాయం వస్తున్న దేవాలయంగా శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రం నిలిచింది. రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా దేవాలయానికి వచ్చే భక్తులకు ఏర్పాట్లు కల్పించేందుకు టెండర్ల ప్రక్రియ ఎప్పుడో పూర్తి కావాల్సింది. టెండర్లు పూర్తయితేనే భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి పనులు ప్రారంభమవుతాయి. నేటికీ ముఖ్యమైన టెండర్లు పూర్తి కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.

పుణ్యక్షేత్రంలో ఈరన్న స్వామి అలంకరణ కోసం పూలమాలలు, వస్త్రాలు, నిత్యాన్నదానం కోసం వంట చెరకు, ప్లంబింగ్, కొబ్బరికాయల విక్రయాలు, తలనీలాలు పోగు చేసుకునే హక్కు, నిత్యాన్నదానం సత్రం వద్ద, దర్శనం కోసం టికెట్ల కౌంటర్ వద్ద, స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లతోపాటు తాత్కాలిక షెడ్లు, పుణ్యక్షేత్రం డెకరేషన్ కోసం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహిస్తారు. ఇందులో కొన్ని పూర్తి కాగా, పెండల్, డెకరేషన్, గరుసు వేసేందుకు ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు టెండర్ల ప్రక్రియ ఎప్పుడో పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటివరకు పూర్తి కాకపోవడంతో అధికారులపై విమర్శలు వస్తున్నాయి.

శ్రావణమాస ఉత్సవాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేందుకు క్యూలైన్లు, టికెట్ల కౌంటర్ల వద్ద క్యూలైన్లు, అన్నదాన సత్రం వద్ద క్యూలైన్లతోపాటు వివిధ ప్రాంతాల్లో షెడ్లు, కౌతాళం, కోసిగి, ఆదోని వద్ద ఆర్చి గేట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. దేవాలయానికి విద్యుత్ అలంకరణతో పాటు పుణ్యక్షేత్రంలో విద్యుద్దీపాలు వెలిగించాల్సి ఉంది. క్షేత్రం ఆవరణలో అక్కడక్కడ ఏర్పడిన గుంతల వద్ద, వర్షపు నీరు నిల్వ ఉన్న చోట గరుసు వేయాల్సి ఉంది. ఈ టెండర్లు పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. క్యూలైన్లు, షెడ్లు, ఆర్చి గేట్లు వేయడానికి కనీసం 10 నుంచి 15 రోజుల సమయం పడుతుంది. డెకరేషన్ చేయడానికి కూడా సమయం ఎక్కువ కేటాయించాల్సి ఉంటుంది. ఈ పనులు కాకుండా పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల కోసం తాగునీటి సౌకర్యం, స్నానపు ఘాట్ వద్ద భక్తులకు ఏర్పాట్లు, మరుగుదొడ్ల సౌకర్యంతో పాటు అనేక పనులు చేయాల్సి ఉంది. ఆంధ్ర రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో స్వామివారి దర్శనం కోసం వస్తారు. నెలరోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఇటీవల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి అధికారులు చేతులు దులుపుకున్నారే తప్ప ఏర్పాట్లపై పెద్దగా శ్రద్ధ వహించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి భక్తుల నుంచి మంచి పేరు సంపాదిస్తారో, లేక విమర్శలకు గురవుతారో వేచి చూడాల్సిందే.



శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం

టిటిడి ఛైర్మన్ యాదవులకు ఇవ్వలేదని...

- వైసిపికి సీనియర్ నేత రమేష్ యాదవ్ రాజీనామా

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వైసిపి తీరని అన్యాయం చేసిందని, టిటిడి ఛైర్మన్ పదవి బీసీలకు కేటాయిస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రెడ్లకు కేటాయించారని, అందుకే వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు వైసిపి సీనియర్ నాయకులు, బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ రమేష్ యాదవ్ తెలిపారు. సోమవారం ఆదోనిలో శ్రీకృష్ణ దేవాలయం కమ్యూనిటీ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిటిడి ఛైర్మన్ పదవి బీసీలకు కేటాయిస్తానని గతంలో ఇచ్చిన మాటను జగన్మోహన్ రెడ్డి విస్మరించారని తెలిపారు. మొదటి దఫా రెడ్డి, మరోసారి భూమన కరుణాకర్ రెడ్డికి కేటాయించారని చెప్పారు. ఇన్నాళ్లు జాంగా కృష్ణమూర్తికి ఇస్తామని చెబుతూ మాట తప్పారన్నారు. అందుకే తాను వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన కుటుంబం, తాను దశాబ్దాలుగా కాంగ్రెస్, వైసిపిలోనే కొనసాగామని చెప్పారు. రాష్ట్రంలో బీసీలకు న్యాయం జరిగే వరకూ తాను రాష్ట్రవ్యాప్తంగా అందరినీ కలిసి పోరాడతానని తెలిపారు. గతంలో టిడిపి హయాంలో టిటిడి ఛైర్మన్‌గా పుట్టా సుధాకర్ యాదవ్‌కు కేటాయించారని చెప్పారు. ఇటీవల ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక్కటి కూడా కురువ, యాదవులకు కేటాయించలేదన్నారు. టిడిపి బీసీలకు జిల్లా అధ్యక్ష పదవులు, కర్నూలు, నంద్యాల కేటాయిస్తే వైసిపి ఒక్కరితోనే సరిపెట్టిందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల ప్రాతినిధ్యాన్ని వైసిపి తగ్గిస్తోందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు సొంతంగా పార్టీ ఏర్పాటు చేసుకునే పరిస్థితులు కల్పించారన్నారు. జిల్లాలో ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపిలలో తక్కువ జనాభా ఉండే అగ్రవర్ణ కులాల నాయకులే కనబడుతున్నారని తెలిపారు. బీసీలకు జిల్లాలో నాలుగు ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. త్వరలో బీసీల తరపున ఉద్యమానికి సిద్ధమవుతామని, బీసీలకు సముచిత స్థానం కల్పించే వరకు పోరాడతామని తెలిపారు. రాష్ట్రంలో బీసీల సత్తాచాటి రెండు పార్టీలకు బుద్ధి చెబుతామని, టిటిడి ఛైర్మన్ పదవి యాదవులకు ఇచ్చే వరకు పోరాడతామని వివరించారు. యాదవ సంఘం నాయకులు హుస్సేనప్ప యాదవ్, హనుమన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ యాదవ్

భూమిని కాపాడుకోలేకపోతున్నా..!

- 13 ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు
- మాజీ సైనికుడు మహేష్

ప్రజాశక్తి-ఆలూరు

దేశం కోసం పోరాడిన తనకు ప్రభుత్వం ఇచ్చిన పొలాన్ని కాపాడుకోలేకపోతున్నాని మాజీ సైనికుడు మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తన పొలం నుంచి 53 సెంట్లు మరొకరి సర్వే నెంబర్‌లోకి అక్రమంగా చేర్చారని తెలిపారు. న్యాయం చేయాలంటూ 13 ఏళ్లుగా అధికారులకు, ముఖ్యమంత్రి, కలెక్టర్లకు విన్నవించినా న్యాయం జరగలేదని వాపోయారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని హత్తిబెళగల్ గ్రామ పరిధిలో 1979లో ప్రభుత్వం దళితులకు ల్యాండ్ సీలింగ్ ద్వారా 27 ఎకరాల భూమి ఇచ్చిందని తెలిపారు. తనకు సర్వే నెంబరు 622లో 2.96 ఎకరాల భూమిని ఇచ్చిందని చెప్పారు. అప్పటి నుంచి ఆ భూమిని తానే సాగు చేసుకుంటూ ఆలూరు స్టేట్ బ్యాంకులో 2.96 ఎకరాలకు పంట రుణం కూడా తీసుకున్నట్లు తెలిపారు. 2011లో తనకు కేటాయించిన భూమిలో 53 సెంట్ల భూమిని మరొకరి సర్వే నెంబరులో రెవెన్యూ అధికారులు చేర్చారని చెప్పారు. ప్రస్తుతం తనకు 2.43 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపుతోందని అన్నారు. అవకతవకలపై 2015లో రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సర్వే చేయిస్తే తన భూమిలో ఉండాల్సిన 53 సెంట్లు పక్కనే ఉన్న హత్తిబెళగల్‌కు చెందిన నల్లన్న కుమారుడు గుండప్ప పొలంలో కలిసినట్లు తేలిందన్నారు. గుండప్పకు ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ భూమి ఇస్తే ఆ భూమి ప్రస్తుతం ప్రభాకరయ్య పేరుతో ఉందని తెలిపారు. గుండప్ప పేరు మార్చుకొని ప్రభాకరయ్యగా చలామణి అవుతూ తమ భూమిలోని 53 సెంట్ల భూమిని కబ్జా చేశారని విమర్శించారు. ఆర్‌టిఐ యాక్ట్, ప్రజాదర్బార్, స్పందన వంటి కార్యక్రమాల్లో కలెక్టర్, ఆర్‌డిఒలకు అర్జీలు ఇస్తూనే ఉన్నా ఏ ఒక్క అధికారి కూడా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకెందుకు న్యాయం చేయడం లేదని, ఎవరికి భయపడి తన భూమిని తనకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయానని, తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఈ విషయం ఆర్‌డిఒ కోర్టులో ఉందని తహశీల్దార్ రామాంజినేయులు తెలిపారు.

దీక్షకు మాజీ సైనికుల మద్దతు

భూమి కోసం దీక్ష చేపట్టిన మాజీ సైనికుడు మహేష్‌కు మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నాయకులు శివ ప్రసాద్, కుళ్లయ్య, ఖాజా, బాటప్ప, తిమ్మప్ప, రామకృష్ణ, నాగరాజు, గోవిందు, రామచంద్ర మద్దతు తెలిపారు. న్యాయం జరగకపోతే ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరాహారదీక్ష చేపడతామన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్ష చేపట్టిన మాజీ సైనికుడు మహేష్

వైస్ ఎంపిపి నాగమ్మ మృతి

ప్రజాశక్తి - కోసిగి



కోసిగి మండల ఉపాధ్యక్షులు-1 (వైస్ ఎంపిపి) ఆవుల నాగమ్మ (70) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. నాగమ్మ వైసిపి తరపున సజ్జలగుడ్డం ఎంపిటిసిగా ఏకగ్రీవంగా ఎన్నికై వైస్ ఎంపిపి పదవి చేపట్టారు. నాగమ్మకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు దుద్ది రామలింగ గ్రామంలో వైసిపిలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి నాగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపి యువ నాయకులు వై.ధరణీ రెడ్డి, మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి సంతాపం తెలిపారు.

నీళ్ల వ్యాపారిపై దాడి

- కేసు నమోదు, బాధితుని ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - చిప్పగిరి

'మా గ్రామంలో వాటర్ ప్లాంట్ పెట్టుకుని మేము నీళ్ల వ్యాపారం చేస్తుండగా వేరే గ్రామానికి చెందిన నువ్వు మా ఊరికి వచ్చి నీళ్ల వ్యాపారం ఎలా చేస్తావ్' అని దాడి చేసి గాయపరచిన సంఘటన మండలంలోని ఏరూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్‌బాబు వివరాల మేరకు... చిప్పగిరి గ్రామానికి చెందిన ఖలీల్ కుమారుడు అబ్దుల్ తమ వాటర్ ప్లాంట్ నుంచి తాగునీటిని ఆటోలో తీసుకెళ్లి ఏరూరు గ్రామంలో అమ్ముతున్నారు. ఏరూరు గ్రామానికి చెందిన వాటర్ ప్లాంట్ యజమాని మక్తం కుమారుడు షాకీర్ దాడి చేసి గాయపరిచారు. సోమవారం బాధితుడు విలేకరులతో మాట్లాడారు. దాడికి దిగుతూ చంపుతానని బెదిరిస్తున్నారని, ఏరూరు గ్రామస్తులు రమ్మన్నందుకే తాగునీరు సరఫరా చేయడానికి ఆటోలో వెళ్లానని తెలిపారు. తనపై దాడి చేసి తల పగలగొట్టడమే కాకుండా, తాను తీసుకెళ్లిన ఆటోను కూడా ధ్వంసం చేసినట్లు వాపోయారు. ఈ విషయంపై ఎస్ఐ రమేష్ బాబును వివరణ కోరగా... బాధితుడు అబ్దుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

పట్టణంలోని శివన్న నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు జేరుబండి ఆంజనేయులు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. పట్టణానికి చెందిన పద్మశాలి సంఘం నాయకులు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. పద్మశాలి బహుత్తమ సంఘం అధ్యక్షులు విశ్వనాథ్, రమేష్, ప్రధాన కార్యదర్శి పోలే వీరప్రసాద్, కోశాధికారి దోమ భీమేష్, కార్యదర్శి మానా సత్యనారాయణ, గోరంట్ల, పాండు పాల్గొన్నారు.

ముద్ద చర్మపు వ్యాధి నిరోధక వ్యాక్సినేషన్

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని చిన్నహ్యాట గ్రామంలో పశువులకు ముద్ద చర్మపు వ్యాధి నిరోధక వ్యాక్సినేషన్‌ను పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ సంస్థల ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. పశువులు కలిగిన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ వెటర్నరీ అసిస్టెంట్ జిలాన్ బాష కోరారు. రైతులు పశువుల సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలకు రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థలు తమ సహాయ, సహకారాలను అందిస్తాయని, వివిధ ప్రభుత్వ సంస్థలను సమన్వయ పరుస్తుందని నాగరాజు తెలిపారు. 60 జతల ఎడ్లకు, ఆవులకు వాక్సినేషన్ చేసినట్లు చెప్పారు.





శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- డీఎస్పీ శివ నారాయణస్వామి

ప్రజాశక్తి - ఆదోని

సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి హెచ్చరించారు. ప్రజల్లో ఎలాంటి భయాందోళన ఉండకూడదని, వారిలో భయం పోగొట్టేందుకు రాపిడ్ ఫోర్స్ ద్వారా పట్టణంలో భారీ ఎత్తున కవాతు నిర్వహించారు. సోమవారం పట్టణంలోని వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆయా వీధుల్లో ఆర్ఏఎఫ్, హైదరాబాద్‌కు చెందిన 99 బెటాలియన్ ఫోర్స్ డిప్యూటీ కమాండర్ టిపి భఘేల్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. పొజిషన్ నుంచి భీమా సర్కిల్, శ్రీనివాస్ భవన్ సర్కిల్, పెద్ద మసీదు, బంగారు బజార్, బొడ్డేకల్, హవన్నపేట సర్కిల్, తిక్క స్వామి దర్గా సర్కిల్, ఎమ్మిగనూరు టర్నింగ్, చందా సాహెబ్ దర్గా ప్రాంతాల్లో కవాతు సాగింది. ప్రజల్లో పోలీసులపై నమ్మకం కల్పించడం, పోలీసు వ్యవస్థ గట్టిగా ఉందని భరోసా ఇస్తున్నట్లు ఆర్ఏఎఫ్ ఫోర్స్ డిప్యూటీ కమాండర్ భఘేల్ వివరించారు. గత రెండేళ్ల క్రితం పట్టణంలో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. తమ 99 ఫోర్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కవాతు నిర్వహించి ప్రజల్లో భయాందోళన పోగొట్టినట్లు చెప్పారు. ఆదోని సిఐలు విక్రమ్ సింహ, నరసింహ రాజు, ఆర్‌పిఎఫ్ 99 ఇన్‌స్పెక్టర్లు ఎకె.శర్మ, శంకర్ యాదవ్, రాబిన్ బాబు పాల్గొన్నారు.

కొడే పీర్లకు విశేష పూజలు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని కల్లుకుంట గ్రామంలో కొడే పీర్ల ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామంలో ఊరేగిస్తూ భక్తులు విశేష పూజలు నిర్వహించారు. తాత జంగిల్ తాత గ్రామంలో ఊరేగుతూ ఆదివారం రాత్రి గ్రామ పొలాల పొలిమేర వరకు వెళ్లి సోమవారం ఉదయం గ్రామానికి చేరుకున్నారు. గ్రామ చావిడి దగ్గర సవారి మూసుకొని ఒకరికొకరు తీసుకున్నారు. అలా చేయడంతో గ్రామంలో ఎలాంటి ఆటంకాలూ జరగకుండా ఉంటాయని గ్రామస్తుల నమ్మకం.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి అరుణ్ కుమార్

జగనన్న కాలనీ ప్రారంభోత్సవానికి సిద్ధం

- సర్పంచి అరుణ్ కుమార్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో జగనన్న కాలనీని ఈనెల 20 నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్ తెలిపారు. సోమవారం తెర్నేకల్‌లో జగనన్న కాలనీ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో మొదటి దశ కింద 199 ఇళ్లకు గాను 84 ఇళ్లు పూర్తి చేసినందుకు ఎంపికైనందుకు లబ్ధిదారులను ప్రశంసించారు. ఇందుకు కృషి చేసిన ఇంజినీర్ అసిస్టెంట్లు గోపాల్, మల్లికను అభినందించారు. ఎంపిపి భర్త దాసరి లుమాంబ, ఉప సర్పంచి భర్త ఈరన్న, హౌసింగ్ ఇఇ ప్రభాకర్, డిఇ ఆది నారాయణ, విద్యుత్ డిఇ సుధాకర్, ఎడి రామకృష్ణ, ఎఇ నారాయణ స్వామి, పంచాయతీ కార్యదర్శి సునీత, సచివాలయ కన్వీనర్ వాల్మీకి రాఘవేంద్ర, చాప ఈరన్న, వైసిపి నాయకులు లింగన్న, ఏసేపు, నాగన్న పాల్గొన్నారు.

చేనేతలపై పన్ను విధించడం సిగ్గుచేటు

- ఎమ్మెల్యే ఎర్రకోట

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఎమ్మెల్యేను, జడ్‌పి ఛైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

చేనేతలపై కేంద్రం పన్ను విధించడం సిగ్గుచేటని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, జడ్‌పి ఛైర్మన్ పాపి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం కేంద్రం అన్నింటిపైనా పన్ను వేస్తోందని, మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. బిజెపి వల్ల పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అమరావతిని రాజధాని చేయడానికి గ్రాఫిక్స్ చూపించి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. అలాగే పద్మశాలి సంఘం కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. చేనేత కార్మికులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి సన్మానించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాయలసీమ ప్రాంతీయ పద్మశాలి సంఘం అధ్యక్షులు, రోహిణి ఇన్‌ఫ్రా అవెన్యూ ప్రయివేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కొంకతి లక్ష్మి నారాయణ మాట్లాడారు. చేనేతలను కాపాడడానికి రాజకీయ పార్టీలు న్యాయం చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో చేనేత సామాజిక వర్గానికి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలని తెలిపారు.

టిడిపితోనే మహిళ ఆర్థికాభివృద్ధి

- తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి నాడిగేని నరసమ్మ

ప్రజాశక్తి- కోసిగి

రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలని తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి నాడిగేని నరసమ్మ, శంకుతలమ్మ, సరోజమ్మ, రూతమ్మ తెలిపారు. టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు 'మహాశక్తి' కార్యక్రమంలో భాగంగా కోసిగి శ్రీఎల్లమ్మ అవ్వ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోసిగి మండలం కోల్మాన్ పేట గ్రామంలో గుడిసె మంగమ్మ, తిప్పలదొడ్డి ఎల్లమ్మ అధ్యక్షతన ఇంటింటికీ తిరుగుతూ మహిళలు కోసం చంద్రబాబు ప్రకటించిన పథకాలను వివరించారు. నియోజకవర్గంలో పాలకుర్తి తిక్కారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాడిగేని లక్ష్మి, దుద్ది సర్పంచి వరలక్ష్మి పాల్గొన్నారు.



మహా శక్తి కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి మహిళ నాయకులు

ఆదోనిలో ఆరోగ్యశ్రీ సేవలు

- మధు ఆస్పత్రిలో అందుబాటులో సేవలు
- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సదుపాయం కోసం దూర ప్రాంతాలకు వెళ్లేందుకు రోగులు ఇబ్బందులు పడేవారని, అలాంటి సమస్య రాకుండా ఆదోనిలోని మధు ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషదాయకమని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ మధు ఆస్పత్రిలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ గురెడ్డి ఆధ్వర్యంలో చికిత్స విభాగాన్ని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ శాంత, ఆస్పత్రి డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి వచ్చి ఇన్నేళ్లయినా ఆదోనిలో ప్రయివేట్ ఆస్పత్రుల్లో సదుపాయం లేకపోవడంతో చికిత్సల కోసం కర్నూలు, హైదరాబాదు వంటి ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడేవారని తెలిపారు. అక్కడికి వెళ్లిన కూడా ఆస్పత్రి నిర్వాహకులు రోగుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో దిక్కుతోచక చాలామంది తమకు ఫిర్యాదులు చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఆదోనిలో కూడా ఉచితంగా ఆరోగ్యశ్రీ సేవలు అందించాలని ఎన్నో ఏళ్లుగా కృషి చేసినట్లు తెలిపారు. మధు ఆస్పత్రిలో అన్ని సదుపాయాలు ఉండడం వల్ల ఆరోగ్యశ్రీ సేవల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. తనవంతుగా సహకరించి ఇక్కడ సేవలు అందించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని తెలిపారు. రోగులు ఇబ్బందులు పడకుండా ఆస్పత్రి నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఉద్యోగులకు, జర్నలిస్టులకు, ఆర్‌టిసి ఉద్యోగులకు ఆరోగ్యశ్రీ సేవలు వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. నాయకులు అశోక్ నంద రెడ్డి, సుబ్బారెడ్డి, మురళీ రెడ్డి, దేవా, దుర్గప్ప, పెరిగేలా నారాయణ, వాల్మీకి లక్ష్మీనారాయణ, ఆస్పత్రి ఉద్యోగులు రాజు, సునీల్ ఉన్నారు.



ఆరోగ్యశ్రీ చికిత్స విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

కోలుకుంటున్న విద్యార్థిని
- పరామర్శించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

పట్టణంలోని కళాశాల బీసీ హాస్టల్‌లో విష పురుగు కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని కల్పన ఆరోగ్యంపై ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి ఆరా తీశారు. సోమవారం విద్యార్థిని చికిత్స పొందుతున్న మధు ఆస్పత్రిలో కల్పనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థిని కల్పన ఆరోగ్య పరిస్థితి కుదుటపడే వరకు ఆస్పత్రిలోనే ఉంటుందన్నారు. వైద్యానికి అయ్యే ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. హాస్టల్ ఆవరణలో అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు త్వరలోనే హాస్టల్‌ను సందర్శిస్తామని తెలిపారు. ఆరోగ్యం కుదుటపడే వరకు చూస్తూనే ఉండాలని వార్డెన్ ప్రమీలకు సూచించారు. విద్యార్థిని ఆరోగ్యం పట్ల అపోహలు నమ్మవద్దని, ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందిస్తున్నారని తెలిపారు. వెంటిలేటర్ ద్వారా మెరుగైన వైద్యం అందించామని డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు.



డాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే





కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, మున్సిపల్ కార్మికులు

రేషన్ 'కంది' పోయింది

- మూడు నెలలుగా కందిపప్పు సరఫరా నిలిపివేత
- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 200 - కొనలేకపోతున్న పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలు

ప్రజాశక్తి - చాగలమర్రి

నిరుపేదల ఇళ్లల్లో రేషన్ బియ్యం ఉంటే చాలు అన్నం వండుకుని గిద్దెడు కందిపప్పుతో పప్పుచారు కాసుకుంటే ఆ రోజు గడిచిపోతుంది. నిత్యవసరాల ధరలు కొండెక్కి కూర్చున్నాక రేషన్ సరుకుల్లో బియ్యం తీసుకున్నా లేకున్నా పంచధార, కందిపప్పును పేద మధ్యతరగతి లబ్ధిదారులు క్రమం తప్పకుండా తీసుకుంటున్నారు. నెలలో అవి ఉన్నంతవరకు కొంత నిశ్చింతగానే కుటుంబ పోషణ సాఫీగా సాగిపోతుంది. వంటింట్లో అవి నిండుకున్నాయో బజార్లో కొనాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిందే. పేదల భోజనానికి అంతగా ఉపయోగపడే కందిపప్పు పంపిణీకి గత మూడు నెలల నుంచి ప్రభుత్వం చెక్ పెట్టింది. బియ్యం, పంచదార మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంది.



బియ్యం, చక్కెర పంపిణీ చేస్తున్న ఎండియు ఆపరేటర్లు



నెల రోజుల కిందటి వరకు కందిపప్పు కిలో రూ.120 ఉంది. ఇప్పుడు ఒక్కసారిగా రూ.200కి చేరింది. నంద్యాల జిల్లాకు ఎక్కువగా నాగపూర్ ప్రాంతం నుంచి, రాయలసీమ జిల్లాల నుంచి కందిపప్పు సరఫరా అవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పును ఒకేగుత్తేదారు సరఫరా చేస్తుంటారు. ప్రభుత్వం నుంచి గుత్తేదారుకు బిల్లులు చెల్లించడంలో జాప్యం ఓ కారణమైతే ఈ ఏడాది దిగుబడి తగ్గడంతో కూడా సరుకు గిరాకీ పెరిగి ధరలు అమాంతంగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. మరో మూడు నెలలపాటు ధర ఇలాగే ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చాగలమర్రి మండల వ్యాప్తంగా 15407 రేషన్ కార్డులు ఉన్నాయి. మండల పరిధిలో 11 ఎండియు వాహనాలు పని చేస్తున్నాయి. ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు ఒక్కొక్క రేషన్ కార్డుకు కిలో చొప్పున కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం వీటి సరఫరాలో చేతులు ఎత్తేయడంతో పేదలకు భారంగా మారింది. రేషన్ షాపుల ద్వారా కేజీ కందిపప్పు ప్యాకెట్ రూ.67 విక్రయిస్తారు. బయట మార్కెట్లో రూ.200 పలుకుతుండడంతో పేదలు బెంబేలెత్తిపోతున్నారు.

కందిపప్పు కొనాలంటే భయమేస్తుంది

నిత్యం కూలి పనులకు వెళ్లి పూట గడుపుకుంటున్నాం. గత మూడు నెలలుగా ప్రభుత్వం రేషన్ కార్డులకు కందిపప్పు సరఫరా చేయడం లేదు. రేషన్ షాపుల్లో కిలో ప్యాకెట్ ధర రూ. 67 విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం కిలో రూ. 200 పలుకుతుంది. కందిపప్పు కొనాలంటేనే భయం వేస్తుంది.

- షంషాద్ బేగం, గృహిణి, చాగలమర్రి.

రేషన్ షాపుల ద్వారా కందిప్ప పంపిణీ చేయాలి



నిత్యావసర సరుకుల ధరలు పెరిగి అల్లాడుతున్నాం. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా బయట మార్కెట్లో రూ 200 పెట్టి కందిపప్పు కొనుగోలు చేయాలంటే భారంగా మారింది. మూడు నెలల నుంచి కందిపప్పు సరఫరా చేయడం లేదు. ప్రభుత్వం స్పందించి రేషన్ షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ చేయాలి.

- షబానా బేగం, గృహిణి, చాగలమర్రి.

మున్సిపల్ కార్మికుల
సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

- కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని మున్సిపాలిటీలలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు కట్టించి ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటి పిలుపు మేరకు సోమవారం నంద్యాల కలెక్టరేట్ ముందు మున్సిపాలిటీలలో వివిధ సెక్షన్లలో పని చేస్తున్న కార్మికులు సిఐటియు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. జీవో 151 ప్రకారం మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో అర్హత కలిగిన కాంట్రాక్టు కార్మికులందరికీ స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరికీ ఏపిసిఓఎస్ నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. రూ.6 వేలు హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించాలన్నారు. పనిముట్లు, రక్షణ పరికరాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు పూర్తి అయ్యి రిటైర్డు అయిన వారికి బెనిఫిట్స్ 5 లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కె.మహమ్మద్ గౌస్‌లు మాట్లాడారు. అనంతరం నాయకులు జిల్లా కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు భాస్కరాచారి, కృష్ణయ్య, రామకృష్ణ, ఆదాము, కరిముల్లా, నాగేశ్వరరావు, ఈశ్వరయ్య, రామాంజనేయులు, నాగేంద్రప్రసాద్, ప్రసాద్ రావు, మురళీ, కర్ణ కుమార్, గురువేశ్వరుడు, డోన్ మున్సిపాలిటీ నాయకులు కుల్లాయప్ప, పెద్ద ఎల్లయ్య, ఆళ్లగడ్డ మున్సిపాలిటీ నాయకులు సాల్మన్, అధ్యక్షుడు వెంకటయ్య, మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీశైలం నీటిమట్టం 862 అడుగులు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో జలాశయ నీటిమట్టం 862.20 అడుగులకు చేరుకుంది. గరిష్ట స్థాయికి చేరువలో ఉండడంతో సాయంత్రం ఆరు గంటల సమయానికి అవసరం మేరకు కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రం ద్వారా 4,975 క్యూసెక్కులతో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. ఎగువ జూరాల నుండి 56,801 క్యూసెక్కుల నీరు జలాశయానికి వచ్చి చేరుతున్నాయి. అదే సమయానికి తెలంగాణ భూగర్భ విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. జలాశయం నీటి నిలువ సామర్థ్యం 112.9696 టిఎంసిలుగా నమోదయింది.

కలెక్టర్ చెప్పినా ఆన్‌లైన్ చేయరంటా..

- ఎమ్మెల్యే లెటర్ ప్యాడ్ ఉంటేనే తహశీల్దార్, విఆర్‌ఒ చేస్తామంటున్నారు..

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'20 ఏళ్లుగా బంజరు భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. ఆ భూమిని తమ పేరు మీద సబ్ డివిజన్ ఆన్‌లైన్ చేయాలని కొలిమిగుండ్ల తహశీల్దారును, విఆర్‌ఒను కలిసి అడిగితే స్పందించడం లేదు. కలెక్టర్ సారు చెప్పినా ఆన్‌లైన్ చేయబోమని చెబుతున్నారు. ఎమ్మెల్యే లెటర్ ప్యాడ్‌తో వస్తేనే ఆన్‌లైన్ చేస్తామంటున్నారు అధికారులు.. మీరైనా న్యాయం చేయండి' అంటూ కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామానికి నిరుపేద రైతులు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామాన్‌కు మొరపెట్టుకున్నారు. సోమవారం స్పందనలో బాధిత నిరుపేద రైతులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం బాధిత రైతులు మాట్లాడుతూ కల్వటాల గ్రామానికి చెందిన సర్వే 26/3లో 73 ఎకరాల బంజరు భూమి ఉందని తెలిపారు. ఈ భూమిలో దాదాపు 25 కుటుంబాల నిరు పేద రైతులమైన తాము కొంత సాగు చేసుకుంటూ గత 20 ఏళ్లుగా జీవిస్తున్నామని చెప్పారు. కొంత మంది రైతులు మామిడి చెట్లు వేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ భూములపై అనుభవంలో ఉన్న తమ పేర్ల మీద సబ్ డివిజన్ చేసి ఆన్‌లైన్ చేయాలని స్థానిక తహసీల్దార్‌ను, విఆర్‌ఒను కోరగా స్థానిక ఎమ్మెల్యే లెటర్ ప్యాడ్ ఉంటేనే ఆన్‌లైన్ చేస్తామని, కలెక్టర్ చెప్పినా చేయబోమని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే బంజరు భూములలో సర్వే 26/8లో 1.35 ఎకరం కామిని మాధవికి, సర్వే 35/బిలో 7.14 ఎకరాలు కామిని తిమ్మారెడ్డిలకు ఇచ్చారని, వాళ్లు ఎలాంటి సాగులో లేరని, అయినా ఆన్‌లైన్ చేసి పట్టాదార్ పాసు పుస్తకాలు కూడా ఇచ్చారని తెలిపారు.

20 ఏళ్లుగా తాము అనుభవంలో ఉన్నా ఆన్‌లైన్ చేయడం లేదన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకోని సబ్ డివిజన్, ఆన్లైన్ చేయించి పట్టాదారు పాసు బుక్‌లు ఇప్పించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నిరుపేద రైతులు వంకదారి మేరీ, వంకదారి దానమ్మ, వంకదారి భారతి, పిట్టర్ బిబీ, కైపా సావిత్రి, కోటా సుబ్బమ్మ, చాకలి వరలక్ష్మి, బోయ భూలక్ష్మి, వంకదారి ప్రభాకర్, దూదేకుల పెద్ద మాబు, తెలుగు వెంకటరాముడు, తలారి ప్రమీల, వి.రఘు రాముడు తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బాధిత రైతులు

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- సిఐటియు, విఆర్‌ఎల సంఘం డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట విఆర్‌ఎల రెండ్రోజుల నిరాహార దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విఆర్‌ఎ(తలారి)లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, జిల్లా కార్యదర్శి బి.బాల వెంకట్, విఆర్‌ఎల సంఘం జిల్లా కార్యదర్శి భూపాల్‌లు డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విఆర్‌ఎ(తలారి)లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎపి గ్రామరెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండ్రోజుల నిరాహార దీక్షలు సోమవారం కలెక్టరేట్ ముందు ప్రారంభ మయ్యాయి. దీక్షలకు విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు నాగేష్ అధ్యక్షత వహించారు. దీక్షలను సిఐటియు జిల్లా కార్యదర్శి వి.బాలవెంకట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పని చేస్తున్న వారందరినీ విఆర్‌ఎలుగా ఉంచా లన్నారు. అర్హత కలిగిన వారికి విఆర్వోలుగా, అటెండర్, వాచ్‌మెన్ ప్రమోషన్స్ ఇవ్వాలని, డిఎ రికవరీ వెంటనే నిలుపుదల చేయాలని, డిఏతో కూడిన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాల నుంచి అనేక రూపాల్లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయినా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. గత ఎన్నికల ముందు ప్రతిపక్షనేతగా ప్రస్తుత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. సమస్యలను పరిష్కరించక పోతే చలో విజయవాడ కార్యక్రమం చేపట్టడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా నాయకులు మహేష్, పాములపాడు, బేతంచెర్ల, ఆత్మకూరు, కొత్తపల్లి, నందికొట్కూరు, మిడుతూరు మండలాల అధ్యక్షులు పరమేశు, ఎస్కే భాష, శ్రీనివాసులు, సలాం, మహేశ్వరుడు, శివన్న, రమణ శీనుతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న విఆర్ఏలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



విఆర్ఏల నిరాహార దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపిపి చల్లా, డాక్టర్ వినోద్

'నులిపురుగు నివారణ' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అవుకు : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జాతీయ నులిపురుగుల నివారణ, మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాలపై గోడపత్రికను ఎంపీపీ చల్ల రాజశేఖర్ రెడ్డి, ఉప్పలపాడు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్‌లు సోమవారం ఆవిష్కరించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈఓ శ్రీధర్ రావు, ఈవోఆర్‌డి కృష్ణవేణి, హెల్త్ సూపర్వైజర్ కమల్ సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని ఇల్లూరు కొత్తపేట కొత్త కాలనీలో సుబ్బరామయ్య (32) కొత్త ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు ఎస్సై రామిరెడ్డి సోమవారం తెలిపారు. మృతుడికి భార్య సుధామని, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆశ వర్కర్లపై పనిబారం తగ్గించాలి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్ : ఆశా వర్కర్లపై పని భారం తగ్గించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు డి.శివ బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో శివ బాలకష్ణ పాల్గొని మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రమేష్ బాబు, అబ్బాస్, యూనియన్ జిల్లా అధ్యక్షులు అన్వర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పుంగనూరు ఘటనకు చంద్రబాబే కారణం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : అన్నమయ్య జిల్లా పుంగనూరులో ఈనెల 4న జరిగిన సంఘటనకు కారకులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబేనని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు సీమ ప్రాజెక్టు సందర్శన హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆళ్లగడ్డ అభివృద్ధికి కట్టుబడింది తామేనన్నారు. ముఖ్యమంత్రి ఆళ్లగడ్డకు వచ్చిన సందర్భంగా అభివృద్ధికి రూ. 100 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఒక పద్ధతి ప్రకారం నిధులు మంజూరు అవుతాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎవరికి మద్దతు పలుకుతారనేది ప్రజాక్షేత్రంలో ప్రజలే నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. సమావేశంలో మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ గోపవరం నరసింహారెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, న్యాయవాది అశ్వర్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం స్పందన ఫిర్యాదులను ప్రజలు సంతృప్తి చెందేస్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్, డిఆర్వో పుల్లయ్య తదితర జిల్లాధికారులు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులు రీ ఓపెన్ కాకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలు అసంతృప్తి చెందిన కేసులు, రీఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిశీలించాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులు పూర్తి చేయడంతో పాటు ఇంకా ప్రారంభించని పనులు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో 218 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ విథిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కార్యమ్రకంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఇతర జిల్లాధికారులు పాల్గొన్నారు.



స్పందనలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాలకార్మికు రాలికి కెజిబివిలో సీటు

- ఫలించిన జిల్లా బాలల సంరక్షణ అధికారిణి టి.శారద ప్రయత్నం - బాలికకు డోన్ ఆర్‌డిఒ ఆర్థికసాయం

ప్రజాశక్తి-డోన్

డోన్ మండలం ఆవులదొడ్డికి చెందిన 14 యేళ్ల బాలికను సోమవారం సిడిపిఒ సమక్షంలో కస్తూరిబాగాంధీ పాఠశాలలో సోమవారం 8వ తరగతిలో చేర్పించారు. గ్రామస్తులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..... బాలిక తల్లి సాయి సుజాత, తండ్రి సాయి సాలన్నది పేదకుటుంబం అయినప్పటికీ అమ్మాయిని ఓ ప్రయివేటు పాఠశాలలో 4వ తరగతి వరకు చదివించారు. ఇటీవల కుటుంబం ఆర్థిక పర్థితులు పూర్తిగా బలహీన పడటంతో తండ్రి మద్యానికి బానిసయి తల్లికూతురును వదిలి వెళ్లాడు. తప్పని పరిస్థితిలో తల్లి కూతురు ఆవుల దొడ్డి గ్రామం వదిలి హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ చిత్తుపేపరు ఏరుకుని జీవనం సాగిస్తున్నారు. బాలల సంరక్షణకు కోసం నియమించిన 1098 సిబ్బంది గమనించి ఉమ్మడి జిల్లా బాలల సంరక్షణ అధికారిణి టి.శారదకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వారి సమాచారం మేరకు ఆవులదొడ్డికి వెళ్లి సిడిపిఒ సిబ్బంది విచారించారు. బాలిక మేనమామల సహాయంలో హైదరాబాద్ చిరునామా తెలుసుకుని తల్లికి నచ్చజెప్పి బాలికను ఆవులదొడ్డికి రప్పించారు. అందరూ ఉన్నా ఎవరు పట్టించుకోకపోవడంతో బాలిక భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఉమ్మడి జిల్లా బాలల సంరక్షణ అధికారిణి టి.శారద, నంద్యాల జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారిణి నాగసువచ్చలతో మాట్లాడి డోన్‌లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయలో చేర్పించారు. సోమవారం డోన్ పట్టణంలోని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి టి.శారద, ఐసిడిఎస్ సిడిపిఒ ఎస్.షంషాద్ బేగం, ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభారాణి, కామగానిగుంట్ల మహిళా సంరక్షణ కార్యదర్శి మౌలాబి, ఒఆర్‌డబ్ల్యు శ్వేత కీర్తి, సోషల్ వర్కర్ నరసింహులు ఆధ్వర్యంలో బాలికను కెజిబివి పాఠశాలలో ప్రిన్సిపల్ జోషి హెలెన్ సమక్షంలో చేర్పించారు. బాలిక విషయంపై డోన్ ఆర్‌డిఒ వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బాలికకు ఖర్చుల నిమిత్తం రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం అందించారు. బాలికకు సీటు విషయంలో సహాయం చేసిన నంద్యాల జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారిణి నాగ సువచ్చలకు, డోన్‌లో బాలికకు సంబంధించిన పూర్తి విషయాలు సహాయం చేసిన ఐసిడిఎస్ సిడిపిఒ ఎస్.షంషాద్ బేగం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శోభారాణి, కామగానిగుంట్ల మహిళా సంరక్షణ కార్యదర్శి మౌలాబికి, బాలికకు ఖర్చుల నిమిత్తం రూ.ఐదు వేల అందజేసిన డోన్ ఆర్‌డిఒ వెంకటరెడ్డికి ఉమ్మడి జిల్లా బాలల సంరక్షణ అధికారిణి టి.శారద కృతజ్ఞతలు తెలిపారు.



బాలికకు కెజిబివి పాఠశాలలో ప్రవేశం కల్పిసూ ధ్రువపత్రం అందజేస్తున్న అధికారులు

కోట(పెద్ద)కందుకూరు సర్పంచి ఎన్నికకు నోటిఫికేషన్

- 10 వరకు నామినేషన్ల స్వీకరణ - 19న పోలింగ్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండల పరిధిలోని కోట (పెద్ద) కందుకూరు గ్రామపంచాయతీ సర్పంచి అభ్యర్థికి, ఎస్.లింగందిన్నె 9వ వార్డ్ మెంబర్‌కు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపీడీవో మహబూబ్ ఖాన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పెద్ద కందుకూరులో సర్పంచి కొలిమి దాదాపీర్ రాజీనామా చేయటంతో ఉపసర్పంచి ఆర్ల నాగమ్మ ఇన్చార్జి సర్పంచిగా కొనసాగారన్నారు. ఈ నెల 8 నుంచి పెద్ద కందుకూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాలని వారు తెలిపారు. ఈ నెల 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 14న ఉపసంహరణ, 19న ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామన్నారు. అలాగే ఎస్.లింగందిన్నె గ్రామంలో 9వ వార్డ్ మెంబర్ చనిపోవడంతో ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు.

రుద్రవరం మండలంలో వార్డు మెంబర్ ఎన్నికలకు నోటిఫికేషన్

రుద్రవరం : మండల పరిధిలోని ఆర్.నాగలవరం గ్రామపంచాయతీ 7వ వార్డు, నరసాపురం 10వ వార్డు, పేరూరు 5వ వార్డు మెంబర్ల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేటి నుండి పదో తారీకు వరకు నామినేషన్ల స్వీకరణ, 14న ఉపసంహరణ, 19న తేదీ ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికల పోలింగ్, 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

ప్రజాశక్తి - బనగానపల్లె : మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు కేడం సుబ్బరాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను నిరసిస్తూ సోమవారం పట్టణంలోని అవుకు మెట్ట అంబేద్కర్ విగ్రహం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సమైక్య, ఎమ్మార్పీఎస్, మాలమహానాడు, వడ్డే సంఘం నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని 16న ఆందోళన

ప్రజాశక్తి - నంద్యాల : ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 16న పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు తెలిపారు. సోమవారం పట్టణంలోని సాయిబాబా నగర్‌లో ఉన్న స్వామి రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో ఎం.హబీబ్ బేగ్ అధ్యక్షతన నిర్వహించిన పట్టణ కౌన్సిల్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, సహాయ కార్యదర్శి జి.సోమన్న, వ్యకాసం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణ, సుబ్బరాయుడు, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన చండీయాగం

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని పార్వతి దేవి మారునీళ్ల చెలిమ క్షేత్రంలో గత 20 రోజులుగా నిర్వహిస్తున్న చండీయాగం సోమవారం మహా పూర్ణాహుతితో ముగిసింది. కర్ణాటకకు చెందిన పంచాక్షరి మహా సంస్థాన బృహన్మఠం పీఠాధిపతి శంభు సోమనాథ శివాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చెలిమ క్షేత్రం నిర్వాహకులు బత్తుల రామకృష్ణారెడ్డి, బత్తుల రామ్మోహన్ రెడ్డి, ఆలయ పూజారి రమణారెడ్డి, పాతపాడు సర్పంచి బెడదల మహేశ్వర రెడ్డి, మీరాపురం మల్లేశ్వర రెడ్డి, యాగంటి దేవస్తానం మాజీ ఛైర్మన్ బత్తుల బాలిరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

బలిజ సంఘీయులు ఐక్యంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

బలిజ సంఘీయులందరూ ఐకమత్యంగా ఉండి రాయలసీమలో రాజకీయంగా ఎదగాలని బలిజ సంఘం నాయకులు అన్నారు. కృష్ణదేవరాయల వారి పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా సోమవారం ఆళ్ళగడ్డ పట్టణంలోని గవర్నమెంట్ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి, గాంధీ విగ్రహానికి బలిజ సంఘం నాయకులు నల్లగట్ల బాలుడు ఆధ్వర్యంలో బలిజలు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు మైలేరి మల్లయ్య, సిద్ధి సత్యం, రాందాస్, ఆకుల వెంకటసుబ్బయ్య, అర్జీ గారి నరసింహుడు, సంజీవ రాయుడు, గుత్తి నరసింహుడు, అర్జీ గారి శీను, నీలి వెంకటేశ్వర్లు, నాగిశెట్టి శ్రీధర్, వరద ప్రసాద్, మంగమ్మగారి ప్రసాద్, ఈశ్వరయ్య, కందుకూరు వీరయ్య, గూబగుండం ఆంజనేయులు, లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


సిడిపిఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎఫ్ఆర్ఎస్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు

రాష్ట్ర ప్రభుత్వం బాలింతలకు, గర్భిణులకు టిహెచ్ఆర్ అమలుకు కొత్తగా తీసుకొచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్ సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు మంజుల కోరారు. సోమవారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం నందు ఎఫ్ఆర్ఎస్ యాప్ సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ సిడిపిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు బెడ్ రెస్ట్ లో ఉన్న ఆరోగ్య సమస్య ఉన్న వారికి ఎఫ్ఆర్ఎస్ లింకు లేకుండా వారి కుటుంబ సభ్యులకు ఫుడ్ ట్యాగులు అందించాలని, అంగన్వాడీ సెంటర్ నిర్వహణకు ట్యాబ్లు ఇవ్వాలన్నారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు చెన్నమ్మ, శ్రావ్య, భారతి, లక్ష్మీదేవి, సుజాత, త్రిపుర, విజయలక్ష్మి, రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.


గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజానాట్యమండలి నాయకులు

ప్రజా గాయకుడు
గద్దర్‌కు జోహార్లు..

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక సుందరయ్య భవన్ నందు ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోయిల కొండ నాగరాజు, జోసెఫ్ చంద్రశేఖర్, డివిజన్ కార్యదర్శి దాలు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాటలనే చిరునామాగా చేసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కొరకు పోరాటాలు చేసిన వాగ్గేయకారుడు గద్దర్ అని కొనియాడారు. గద్దర్ ఆశయాలను కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏ. రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహ నాయక్, రైతు సంఘం మండల అధ్యక్షులు మా బాష, ఐలు నాయకులు సగినాల రంగస్వామి, పాతకోట భాస్కర్, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ నాయకులు ప్రసాద్, పట్టణ పౌర సమాఖ్య నాయకులు సురేంద్ర, సిఐటియు నాయకులు గణపతి, గూడ్స్ ఆటో యూనియన్ నాయకులు కలీముల్లా,షరీఫ్, మహబూబ్,రమణ,అలీ తదితరులు పాల్గొన్నారు.

దళిత ముద్దు బిడ్డ జోహార్లు : కెవిపిఎస్

వెలుగోడు : వెలుగోడు సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, వెలుగోడు సిఐటియు మండల అధ్యక్షుడు వి నాగమోహన్ పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారు మాట్లాడుతూ ప్రజా గాయకుడు, సామాజిక విప్లవ నేత గద్దర్ మరణం దళిత ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. కెవిపిఎస్ నాయకులు కిషోర్, కృష్ణ, వెంకటయ్య, నల్లగుర్రయ్య, కులాయి, శివరాం, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పాటలతో కదిలించిన గాయకుడు గద్దర్ : ఎంపీపీ బుగ్గన

బేతంచెర్ల : తన పాటలతో సమాజాన్ని కదిలించి జాగృతం చేసిన ప్రజా గాయకుడు గద్దర్ అని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. సోమవారం నాడు కార్యాలయంలో గద్దర్‌కు నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు, రామనాయుడు, కృష్ణ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల :** ప్రజా యుద్ధనౌక, ఆధునిక వాగ్గేయకారుడిగా ప్రజావాద కళారూపాలతో జన చైతన్యం కలిగించి, ఉద్యమ స్ఫూర్తి రగిలించిన మహోన్నత సాహితీ సాంస్కృతిక శిఖరం గద్దర్ మరణం తీరని లోటని కళారాధన సంస్థ వ్యవస్థాపకులు మధుసూదనరావు, రవికృష్ణ తెలిపారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ గద్దర్ మరణం సాహితీ సాంస్కృతిక రంగానికి, ప్రజల పక్షాన నిలిచే వర్గాలకు, మేధావులకు, సంఘాలకు తీవ్ర ఆవేదన కలిగిస్తుందన్నారు. భవిష్యత్తు తరాలలో స్ఫూర్తిని నింపుతూనే ఉంటుందని, ఉద్యమ జ్యోతిని రగిలిస్తూనే ఉంటుందన్నారు. కళారాధన సాంస్కృతిక సంస్థ గద్దర్‌కు జోహార్లు సమర్పిస్తోందన్నారు.

పోలీసు స్పందనకు 110 ఫిర్యాదులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మొత్తం 110 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. స్పందన ఫిర్యాదులలో ఎక్కువగా సివిల్ తగాదాలు, కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్తి పంపకాలలో మనస్పర్థలు, అత్తారింటి వేధింపులు మొదలగునవి ఉన్నాయని ఎస్పీ పేర్కొన్నారు. స్పందనకు వచ్చిన ఫిర్యాదిదారులకు ఓంకారం దేవస్థానం వారు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జి.వెంకట రాముడు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి జె.వి సంతోష్, తాలూకా యూపీఎస్ ఇన్స్పెక్టర్ దస్తగిరి బాబు, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ సూర్య మౌళి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నేత మృతికి సంతాపం

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ వైసిపి నేత జక్కా రామయ్య అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి సోమవారం రంగాపురం గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగాపురం గ్రామ మాజీ సర్పంచ్ జగన్మోహన్ రెడ్డి, సర్పంచ్ రాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మృత దేహానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు


మాట్లాడుతున్న బుడ్డా రాజశేఖర రెడ్డి

ప్రాజెక్టులను పట్టించుకోని ప్రభుత్వం : బుడ్డా

ప్రజాశక్తి - వెలుగోడు

రివర్స్ టెండరింగ్ విధానంతో రాష్ట్రంలోని పలు ప్రాజెక్టుల పనులు మొదలుపెట్టిన వైసిపి ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరములు కావస్తున్న ప్రాజెక్టుల పనితీరును పట్టించుకోవడంలేదని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం గాలేరు బ్రిడ్జి, మద్రాస్ కెనాల్ లైనింగ్ పనులను ఆయన రైతులతో నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంట్రాక్టర్లకు బిల్లులు రావాలంటే అధికారులను చేయితడపాలని, ఆ లంచం ఎవ్వరికి ముట్టుతుందో ఎమ్మెల్యేకి తెలుసునని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

10న పత్ర కులస్తుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

పత్ర కులస్తుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు పత్ర సంఘం నాయకులు పుల్లయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న కొలిమిగుండ్లలోని సాయిబాబా కళ్యాణమండపంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని చెప్పారు. సంఘం జిల్లా కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు వచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'మోడీ హటావో భారత్‌కి బచావో'ను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - బేతంచర్ల

ఈనెల 9వ తేదీన బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'మోడీ హటావో భారత్‌కి బచావో' నినాదంతో నిర్వహించబోతున్న కార్మిక ప్రదర్శనలను జయప్రదం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు వై ఎల్లయ్య, పట్టణ కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఆర్ ఈశ్వరయ్య అన్నారు. సోమవారం బేతంచెర్ల లారీ మోటర్ వర్కర్స్ కార్యదర్శి వైవి వెంకటేశ్వర్లు అధ్యక్షతన బేతంచర్ల పాత బస్టాండ్ నుండి పట్టణ పురవీధుల గుండా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల స్వేచ్ఛ కోసం కార్మిక సంఘాలు ఐకమత్యంతో పోరాటాల నిర్వహించి హక్కులను కాపాడుకోవాలని అన్నారు. ఈనాడు రెండవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా అడ్డగోలు జీవోలను విడుదల చేసి కార్మికులను బానిసలుగా మార్చేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు ఉద్యమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, శ్రీనివాసులు, అసన్, బాష, రామచంద్రుడు, మద్దిలేటి స్వామి, రాజబాబు, ఎస్‌కే బాష, వెంకటరమణ, నర్సింహులు, అంకాలు నాగరాజు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు

యాగంటి దేవస్థానం
నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

- చైర్మన్‌గా తోట బుచ్చిరెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం ఆలయ ప్రాంగణంలో సోమవారం జరిగింది. ఆలయ ఈవో చంద్రశేఖర రెడ్డి ఆధ్వర్యంలో నూతన పాలకమండలి చైర్మన్‌గా రెండవసారి తోట బుచ్చిరెడ్డి, ఎక్స్ ఆఫీసీయో సభ్యులుగా ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ, కార్యవర్గసభ్యులుగా బింగిమళ్ళ హనుమాన్ కుమార్, బి.మంగమ్మ, గడ్డం జగదీశ్వర రెడ్డి, కొలిమిగుండ్ల లక్ష్మీదేవి, శివవరం మహాలక్ష్మి, కుంచె లలిత, కె శ్రీదేవి, యామ చిన్న పుల్లారెడ్డిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ తోట బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో తాము రెండోసారి పాలక మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశామన్నారు. తమ రెండేళ్ల పదవీకాలంలో ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త దోనపాటి యాగంటిరెడ్డి, అర్చకులు సత్యనారాయణ శర్మ, లోకనాథ్ శర్మ, దేవేంద్రశర్మ, ఆలయ సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్‌లు కుమార్, ప్రసాద్, రమేష్, జోలాపురం తిరుపాల్ పాల్గొన్నారు.


చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్న బుచ్చిరెడ్డి, పాలకమండలి సభ్యులు

శాంపిల్స్‌కు వారంలోనే ఫలితాలు : డిఎఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఇంటిగ్రేటెడ్ ఆగ్రీ ల్యాబ్‌లను అందుబాటులోకి తేవడంతో శాంపిల్స్ ల్యాబ్‌కు తెచ్చిన ఒక వారంలోనే ఫలితాలు రైతులకు అందజేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు తెలిపారు. సోమవారం నంద్యాల ఐఎఎల్ ల్యాబ్‌లో జిల్లాలోని ఆరు నియోజకవర్గాల ఐఎఎల్ ల్యాబ్‌కు సంబంధించిన వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులకు విత్తనం, ఎరువులు, మట్టి పైన ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనం, ఎరువుల నాణ్యత ప్రమాణాలను ఉచితంగా తెలుసుకునేందుకు శాంపిల్స్ ల్యాబ్‌కు తెచ్చిన ఒక వారంలో ఫలితాలను రైతులకు అందజేస్తామని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. వ్యాపార నమూనాలలో, 499 శాంపుల్స్ ఇప్పటి వరకు పరీక్షించి రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని పొందిందని తెలిపారు. ఈ ఆరు రోజులలో మొదటి రెండు రోజులు విత్తనం, మూడు రోజులు ఎరువులు, ఒక రోజు మట్టి పైన ఉంటుందన్నారు.


నాయకులను పరామర్శిస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి

పుంగనూరులో గాయపడిన
నాయకులకు బిసి పరామర్శ

ప్రజాశక్తి - బనగానపల్లె

పుంగనూరులో వైసిపి నాయకుల దాడిలో గాయపడి చిత్తూరు జిల్లా మదనపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న టిడిపి నాయకులను మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు ఒంగోలు పార్లమెంట్ కోఆర్డినేటర్ బిసి జనార్ధన్ రెడ్డి సోమవారం పరామర్శించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన సాగుతుందన్నారు. వైసీపీ వైఫల్యాలను ఎండగట్టడానికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ గుండాలు రాళ్లు రువ్వి గాయపరచడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని, తప్పు చేసిన వైసీపీ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రం విడిచి పారిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కర్నూలు, అనంతపురం, నెల్లూరు, చిత్తూరు, కడప ఉమ్మడి జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

డీలర్లకు ఎరువులు సమానంగా అలాట్మెంట్ చేయాలి : ఎఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఫామ్ ఓ ఉన్న డీలర్లకు సమానంగా ఎరువులను అలాట్మెంట్ చేయాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు ఎరువుల కంపెనీల సేల్స్ మేనేజర్‌లకు సూచించారు. సోమవారం నంద్యాల మండల వ్యవసాయ అధికారి కార్యాలంలో హోల్‌సేల్ డీలర్లు, ఎరువుల కంపెనీల సేల్స్ మేనేజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోల్ సేల్ డీలర్లు రిటైల్ డీలర్లకు ఎరువులు ఇచ్చేటప్పుడు ఇతర ఎరువులను కచ్చితంగా తీసుకోవాలని కానీ, అధిక ధరలకు ఇవ్వడం కానీ చేస్తే వారిపై ఎఫ్‌సిఒ 1985 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల వాగన్ వచ్చేటప్పుడు 2, 3 రోజుల ముందుగానే ముందస్తు ఎరువుల పంపిణీ ప్రణాళికని సమర్పించాలని తెలిపారు. ఎరువుల వాగన్ వచ్చిన వెంటనే సమాచారం ఇవ్వాలని, ఎరువుల వాస్తవ పంపిణీ రిపోర్ట్ వాగన్ వచ్చిన 1-2 రోజులలో సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండలంలోని హోల్ సేల్ డీలర్లు, కంపెనీల సేల్స్ ఆఫీసర్‌లు పాల్గన్నారు.


ఎరువుల కంపెనీ డీలర్లతో సమావేశ నిర్వహిస్తున్న ఏవో ప్రసాదరావు


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న బుడ్డా రాజశేఖర్ రెడ్డి

చంద్రబాబుతో భవిష్యత్తుకు గ్యారెంటీ : టిడిపి

ప్రజాశక్తి - ఆత్మకూర్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు వల్లనే మహిళలకు భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, తెలుగు మహిళా నాయకురాలు గంగాదేవి అన్నారు. సోమవారం నాడు మహాశక్తి ప్రచార రథాన్ని స్థానిక టిడిపి కార్యాలయం వద్ద వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేకించి మినీ మేనిఫెస్టోను నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. అనంతరం ఆత్మకూరు పట్టణం, తోటగిరిలోను, వెంకటాపురం గ్రామంలో జరిగిన మహిళా సమావేశంలో గంగ భవాని మాట్లాడుతూ టిడిపి మినిమేనిఫెస్టోను వివరించారు. రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళలు నాయకులు సరోజమ్మ, శిరీష, తులసమ్మ, టిడిపి ఆత్మకూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జెట్టి వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాష, రాజేంద్ర రెడ్డి, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూర్ : మండలంలోని మల్యాల గ్రామంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ జయ సూర్య ఆధ్వర్యంలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయ సూర్య ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. 2024 ఎన్నికలలో టిడిపిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర నాథ్ రెడ్డి, కురువ శ్రీనివాసులు, పలుచాని మహేశ్వర్ రెడ్డి, అంజి బాబు, ఎంపీటీసీ ఎం యశోదమ్మ, మద్దిలేటి, బాల మద్దయ్య, శివశంకర్, వెంకటేష్, శ్రీనివాసులు, లక్ష్మన్న, వలి బాష, చాందు, కాసిం, కురువ వెంకటయ్య, పాలమారి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు


మాట్లాడుతున్న జడ్పిటిసి లక్ష్మీదేవి

తల్లి పాలే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి

ప్రజాశక్తి - చాగలమర్రి

తల్లి పాలే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని జెడ్పిటిసి జి.లక్ష్మీదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన చాగలమర్రిలోని మల్లెం వీధిలో 16వ అంగన్వాడి కేంద్రం నందు 1,2,4,6,16 కేంద్రాలకు సంబంధించి తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన జడ్పిటిసి లక్ష్మిదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణి చేస్తుందన్నారు. అనంతరం మండల ఉపాధ్యక్షుడు ముల్లా. రఫీ, ఐసిడిఎస్ సుపర్వైజర్ సుశీలమ్మతో కలిసి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణి చేశారు. చాగలమర్రిలోని కోటగడ్డ వీధిలో వున్న 9, 10 అంగన్వాడి కేంద్రా లలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను వార్డు మేంబరు వి. మహబుబ్ షరీఫ్, వైఎస్ఆర్‌సిపి నాయకుడు ముల్లా. గౌస్పీర్, కళావతి, రహమత్లు పంపిణీ చేశారు. వాలంటీర్ షరీఫ్, అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

సర్పంచి, వార్డ్ మెంబర్‌ల ఎన్నిలకు నోటిఫికేషన్ : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పాములపాడు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు మెంబర్లకు ఎన్నికలు జరిపేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిందని ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. సోమవారం ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో పాముల పాడు గ్రామంలో 4వ వార్డ్ మెంబర్ ఖాళీ ఉందని అన్నారు. నామినేషన్ మంగళవారం నుండి ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ ఉంటుందని, 11న పరిశీలన ఉంటుందన్నారు. తిరస్కరించిన దరఖాస్తులను ఆర్డిఓకు అప్పిల్ చేయడం జరుగుతుం దన్నారు.

13న అప్పిల్ పరిష్కారము, 14న నామినేషన్‌ల ఉపసంహరణ, అదేరోజు సాయంత్రం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటించడం జరుగుతుం దన్నారు. 19వ తేదీన ఉదయం 7 నుంచి 1:00 వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, అనంతరం విజేతలను ప్రకటించడం జరుగుతుందన్నారు.

9వ వార్డుకు ఉప ఎన్నిక

పగిడ్యాల: మండలంలోని పగిడ్యాల గ్రామపంచాయతీ పరిధిలో తొమ్మిదో వార్డుకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిందని ఈఓఆర్‌డి నాగేంద్రయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ స్వీకరణ ఉంటుందన్నారు. 19న పోలింగ్, ఫలితాలను ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న సీఐ

ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - కొత్తపల్లి

పోలీస్ స్టేషన్‌కు వస్తున్న ప్రజల పట్ల పోలీసులు స్నేహపూర్వకంగా ఉండాలని ఆత్మకూరు సిఐ నాగభూషణం సూచించారు. సోమవారం మండల కేంద్రమైన కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను సీఐ తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలన చేసి, రికార్డులను, క్రైమ్ రేట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఐ మాట్లాడుతూ నాటుసారాపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హుస్సేన్ బాషా, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు మంజూరు

ప్రజాశక్తి-డోన్

విద్యార్థుల వృత్తి విద్యా కోర్సు కొరకు సమగ్ర శిక్ష వారు కంప్యూటర్లు మంజూరు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ డోన్ పట్టణ ంలోని పాతపేట నందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి ప్రస్తుతం సమగ్ర శిక్ష వారు 5 కంప్యూట ర్‌లతో పాటు ప్రింటర్, ప్రొజెక్టర్‌లను పాఠ శాల నందు ఇన్‌స్టాల్ చేసినట్లు తెలిపారు. కంప్యూటర్‌లో శిక్షణ విద్యార్థులకు ఎంతో ఉపయోగం పడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, శివప్రసాద్,వెంకటరమణ,లక్ష్మయ్య, బాబు,ప్రసాద్ రావు,వొకేషనల్ ట్రైనర్ అల్లిపీరా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


కంప్యూటర్లను పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డి

మెనూ ప్రకారం భోజనాలు : ఎంపిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు వడ్డించాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి కోరారు సోమవారం ఆకస్మికంగా మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అనంతరం వార్డెన్ గంగాధర్ గౌడ్‌తో మాట్లాడుతూ వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్వాతి, పార్నపల్లి ఉప సర్పంచ్ రామలింగేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి

వైసిపితోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వైసిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆళ్లగడ్డ మున్సిపాలిటి పరిధిలోని 6వ సచివాలయం 10వ వార్డ్‌లోని టీచర్స్ కాలనీ, విజయపురి విధి, జమున వీధి, చింతకుంట్ల గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, డాక్టర్ సురేంద్ర నాథ్ రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు రమేష్ గౌడ్, బద్రి భాస్కర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

విద్యా పరిరక్షణ కోసం ఉద్యమించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులంతా ఏక మవ్వాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా అధ్యక్షుడు డక్క కుమార్ అన్నారు. సోమవారం సున్నిపెంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధనిక వర్గాల కోసమే నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చారన్నారు. విద్యార్థులంతా ఏకమై నూతన విద్యా విధానాన్ని రద్దు చేసేంతవరకు ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం 3,4,5 తరగతి హైస్కూల్ విలీనం ద్వారా ఎంపీపీ పాఠశాలలు మూసివేయడం జరిగినదని, జీవో నెంబర్ 77 రద్దు చేయాలని కోరారు. అనంతరం మండల ఎస్ఎఫ్ఐ నూతన కమటీని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న స్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా షేక్.వలి,కార్యదర్శులు జయంత్,సహాయ కార్యదర్శిగా జి. దేవా రాజ్ కుమార్, కుమారి, అంజి, ఉపాధ్యక్షులుగా అఖిల,ప్రకాష్, సానియా బ్లేస్సి రాజుతో పాటు 15 మంది విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

మెగా జాబ్ మేళాలో 432 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని స్థానిక బసిరెడ్డి మెమోరి యల్ డిగ్రీ కాలేజ్ నందు సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 432 మందికి ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ సూది రెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాలో విప్రో, టెక్ మహేంద్ర, హెటిరో, డిక్సన్, హెచ్డిఎఫ్సి, మెడ్ ప్లస్, ఎస్బిఐ కార్డ్, ఐసిఐసిఐ బ్యాంక్, సీమెన్స్ డి.సీ.బి బ్యాంకు, తదితర 18 కంపెనీలు పాల్గొనగా 432 మంది వివిధ రకాల కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్లు శ్రీనివాస రెడ్డి రామచంద్రారెడ్డి, కరస్పాండెంట్ నాగ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూది రెడ్డి రమేష్ రెడ్డి, డైరెక్టర్లు సరళ దేవి, బసిరెడ్డి రమేష్ శ్రీకాంత్ ,స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అడ్వైజర్ శ్రీనాథ్, కళాశాల ప్రిన్సిపల్ జాన్ ఎలీషా బాబు, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు,వివిధ కంపెనీల హెచ్.ఆర్ లు కళాశాల కంప్యూటర్ ఫ్యాకల్టీ, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో కళాశాల యజమాన్యం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్య అభ్యసించిన 1990-1991 బ్యాచ్ 10 వ తరగతి విద్యార్థులు 32 సంవత్సరాల తర్వాత 'స్నేహితుల దినోత్సవం' పురస్కరించుకుని నంద్యాల రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో "గెట్ - టుగెదర్" జరుపుకున్నారు. ఇటీవలే మరణించిన అబ్దుల్ రెహమాన్, ఉస్మాన్ బాషా, శీళ్ళ రవికుమార్ పటిక రామారావు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. అనంతరం మిత్రుడు లక్ష్మి ఫెర్టిలైజర్స్ అధినేత గౌరేశ్వర నాయుడు బహూకరించిన టీ షర్ట్ లు ధరించి ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ నుండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ గా బయలుదేరి వెళ్ళారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడి వినతి మేరకు పాఠశాలకు 4 బీరువాలు ఇవ్వడానికి అంగీకారం తెలిపారు. తర్వాత విదేశాల్లో ఉన్న మిత్రులతో వీడియో కాల్ లో అందరూ జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బసిరెడ్డి కళాశాల ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్,కోట స్కూలు ఫిజికల్ డైరెక్టర్ పెరుమాళ్ళ శ్రీనాథ్, హెడ్ కానిస్టేబుల్ జైపాల్ రాజు, తదితర మిత్రులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో.. స్నేహితులు